క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



కూరగాయలను కొనుగోలు చేస్తున్న అధికారులు

నెల్లిమర్ల: స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయం వద్ద వ్యవసాయ శాఖ, వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించారు. ప్రకృతి సాగు విధానంలో పండించిన వివిధ రకాల కూరగాయలను ఈ ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఏఓ ఎం.పూర్ణిమ, ఏపీఎం ఎల్.సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఎం.నాగరాజు, చీపురుపల్లి సబ్ డివిజన్, ప్రకతి వ్యవసాయ, మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ, ఎఫ్‌పీఓ ఏపీఎం గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల



ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తున్న డీటీ శ్రీనివాసరావు

భోగాపురం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు తుది ఓటరు జాబితాను సోమవారం విడుదల చేశారు. బీఎల్‌ఓల ద్వారా మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల తుది జాబితాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఓటర్లు తమ వివరాలు పరిశీలించుకోవాలని కోరారు.


లెనిన్ స్ఫూర్తితో పోరాటాలు



లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, హమాలీలు

నెల్లిమర్ల: లెనిన్ స్ఫూర్తిగా పోరాటాలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు అన్నారు. జిల్లా విద్యుత్ స్టోర్స్ వద్ద సోమవారం హమాలీ సంఘం ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ.. కార్మిక, కర్షక, పీడిత వర్గాల తరపున పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలతో పెట్టుబడిదారులకు నిద్ర లేకుండా చేసి సోషలిస్టు విప్లవం తీసుకొచ్చారని తెలిపారు. లెనిన్ స్ఫూర్తిగా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణరావు, కలిశెట్టి శ్రీను, మీసాల లెనిన్, కెల్ల గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

1575 డ్వాక్రా సంఘాలకు రూ.12.33 కోట్లు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక, తదితరులు

పూసపాటిరేగ: ఈనెల 24న మండల కేంద్రం పూసపాటిరేగలో నిర్వహించే 'జగనన్న ఆసరా' సభను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎం.రాధిక కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల వీఓఏలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలో డ్వాక్రా 1,575 సంఘాలకు గాను జగనన్న ఆసరా పథకం నాలుగో విడత కింద రూ.12.33 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. వెలుగు ఏపీఎం పెంటంనాయుడు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, కొత్తకోట శ్రీరాములు పాల్గొన్నారు.

మద్యం బెల్ట్‌షాపులపై దాడులు

విజయనగరం క్రైమ్: ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా మద్యం బెల్ట్ షాపులపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. 19 ఎక్సైజ్ కేసులు నమోదుచేసి 20 మందిని అరెస్టు చేశారు. 116.04 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

విగ్రహాల ప్రతిష్ట

దత్తిరాజేరు: కోమటిపల్లి రామ మందిరంలో ఉన్న చిత్ర పటాల స్థానంలో సీతారామలక్ష్మణుల విగ్రహాలను సోమవారం అయోధ్యలో బాలరాముడికి ప్రాణప్రతిష్ట చేసిన ముహూర్తానికే ఇక్కడ ప్రతిష్టించారు. వేద పండితులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం పదివేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీరాముని స్మరణలో..
పులకించిన భక్తజనం



విజయనగరం: గురజాడ కళాక్షేత్రం వద్ద మహిళల కోలాటం



నెల్లిమర్ల: మిమ్స్‌లో శ్రీసీతారాములు కళ్యాణం జరిపిస్తున్న అర్చకులు

అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామ మందిరంలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా వాడవాడల్లో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. కాషాయ జెండాలు, తోరణాలతో వీధులన్నీ పులకించాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీరామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. హిందూ ధర్మ ప్రచార కమిటీల ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో శ్రీరాముని శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణుల చిత్రపటాలను పురవీధుల్లో ఊరేగించారు. పలు చోట్ల భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. జై శ్రీరామ్ నినాదాలతో గ్రామాలు మార్మోగిపోయాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, కోలాటం ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల్లో అన్నప్రసాద వితరణ చేశారు. ఎక్కడ చూసినా ఆధ్యాత్మక వాతావరణం, భక్తిభావం పరిఢవిల్లింది.

–సాక్షి నెట్‌వర్క్



నెల్లిమర్ల రూరల్: రామతీర్థం దేవస్థానంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



నెల్లిమర్ల: శ్రీసరస్వతి శిశుమందిర్‌లో శ్రీరాముని గొప్పతనాన్ని విద్యార్థులకు వివరిస్తున్న వక్తలు



విజయనగరం: గురజాడ కళాక్షేత్రంలో శ్రీరాముని ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్



విజయనగరం: కస్పా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద కోలాటం ఆడుతున్న మహిళలు



నెల్లిమర్ల రూరల్: భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



భోగాపురం: రావాడ రామలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



విజయనగరం రూరల్: రామనాయాయణంలో శ్రీరామునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పూసపాటిరేగ: కొవ్వాడలో రామ మందిరం ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పూసపాటిరేగ: బాలరాముడు ప్రాణప్రతిష్ట సందర్భంగా చిన్నారుల కోలాటం



విజయనగరం: గురజాడ కళాక్షేత్రంలో అయోధ్య రామాలయంలో బాలరాముని ప్రాణప్రతిష్ట ప్రత్యక్ష ప్రసారం



విజయనగరం టౌన్: కోట జంక్షన్ వద్ద రామతీర్థ సేవా పరిషత్ ఆధ్వర్యంలో శోభాయాత్ర



విజయనగరం టౌన్: శ్రీరామ నామ సంకీర్తనలు ఆలపిస్తున్న శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ గాయికులు

బాలరాముని ఆశీస్సులు ప్రజలందిరిపై ఉండాలి

- 'చిన్న శ్రీను సోల్జర్స్' అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర
- జెడ్పీ ఛైర్మన్ నివాసంలో మహా అన్నదానం

విజయనగరం రూరల్: అయోధ్య రామాలయంలో బాలరాముని ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తన నివాసంలో సోమవారం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ సతీమణి మజ్జి పుష్పాంజలి, కుమార్తె సిరి సహస్ర, కుమారుడు సాయిమోహిత్ భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర మాట్లాడుతూ.. అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని తెలిపారు. బాలరాముని ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఉండాలని కోరారు. ఇటువంటి మహత్తర కార్యక్రమాలకు తమ కుటుంబ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. సాయంత్రం ధర్మపురి వీధుల్లో సీతారాముల వారిని పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో ధర్మపురి, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అన్నప్రసాద వితరణ చేస్తున్న జెడ్పీ చైర్మన్ సతీమణి మజ్జి పుష్పాంజలి, కుమార్తె సిరి సహస్ర

శ్మశానవాటిక ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న చిక్కాల సాంబశివరావు, తహసీల్దార్ ధర్మరాజు, తదితరులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీకి సంబంధించి శ్మశానానికి అవసరమైన స్థలాన్ని నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, తహసీల్దార్ డి.ధర్మరాజు సోమవారం పరిశీలించారు. జ్యూట్‌మిల్లు గెస్ట్ హౌస్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. ఎంతో కాలంగా నగర పంచాయతీ ప్రజలు శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి శ్మశానవాటిక కోసం స్థల పరిశీలన చేయాలని సంబంధిత అధికారులకు సూచించారన్నారు. జ్యూట్‌మిల్లు గెస్ట్‌హౌస్ సమీపంలోని స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించినట్లు చెప్పారు. త్వరలోనే కౌన్సిల్‌లో తీర్మానం చేసి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు, డీటీ శైలజ, పార్టీ నాయకులు నౌపాడ శ్రీనివాసరావు, మహంతి అప్పలనాయుడు, ఇడదీసి శ్రీనివాసరావు, సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 33 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపిక సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వాటిపై సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. స్పందనకు 33 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్‌బీ సీఐ కేకేవీ విజయనాథ్, ఎస్సైలు సిద్ధార్థ్, ప్రభావతి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

'ఆడుదాం ఆంధ్రా'తో యువతలో క్రీడా స్ఫూర్తి

డెంకాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో నిర్వహించిన క్రీడలతో యువతీ, యువకుల్లో క్రీడా స్ఫూర్తిని నింపిందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షులు రొంగలి కనకసింహాచలం అన్నారు. మండల స్థాయిలో క్రీడా పోటీల్లో ప్రతిభ చూపించిన క్రీడాకారులకు సోమవారం బహుమతులను అందజేశారు. క్రికెట్ పోటీలో మోపాడ జట్టు విజేతగా నిలిచింది. బాడ్మింటన్ పురుషుల విభాగంలో జొన్నాడ, బాలికల విభాగంలో అక్కివరం జట్టు విజేతలుగా నిలిచాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో మోపాడ, బాలికల విభాగంలో గుణుపూరుపేట విజేతలుగా నిలిచాయి. కబడ్డీ పోటీలో పురుషుల విభాగంలో మోదవలస, బాలకల విభాగంలో డెంకాడ జట్లు విజేతలగా నిలిచాయి. ఖోఖో పురుషుల విభాగంలో మోపాడ, బాలికల విభాగంలో గొలగాం జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు ట్రోఫీలను అందజేశారు. మండల స్థాయిలో రాణించిన క్రీడాకారులు నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూపారాణి, కొండరాజుపేట మాజీ సర్పంచ్ సరగడ బంగారురెడ్డి, ఎంఈఓ వెంకటరమణ, ఈఓపీఆర్‌డీ గనివాడ జగన్నాథ ప్రసాద్, పలు పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.



విజేతలతో ఎంపీపీ వాసుదేవరావు, పీఏసీఎస్ అధ్యక్షులు కనకసింహాచలం, తదితరులు

పవర్ ఎలక్ట్రానిక్స్‌తో పెను మార్పులు

డెంకాడ: పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్‌తో విద్యుత్ రంగంలో పెనుమార్పులు రానున్నాయని లెండి ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి సుబ్బరామయ్య అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో 'న్యూ ట్రెండ్స్ ఇన్ పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ మైక్రోగ్రిడ్స్ అండ్ ఎలక్ట్రానిక్ వెహికల్స్'పై ఐదు రోజుల పాటు అధ్యాపకులకు నిర్వహించే ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, పరశురాం, బీవీఎస్ ఆచార్యులు, జానకి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా అభివృద్ధి

- రూ.1.30 కోట్లతో అచంటా గార్డెన్స్‌లో కొత్త హంగులు
- రూ.7 కోట్లతో మయూరి జంక్షన్–అంబేడ్కర్ జంక్షన్ రోడ్డు విస్తరణ
- నాలుగున్నరేళ్లలో జరిగిన మార్పును చూసి ఆశ్చర్యపోతున్న నగరవాసులు



గార్డెన్‌లో వాకింగ్ ట్రాక్



రూ.1.30 కోట్లతో అభివృద్ధి చేసిన అచంటా గార్డెన్స్

విజయనగరం: ఒకప్పుడు పెద్ద పల్లెటూరుగా పిలిచే విజయనగరం నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. 2019 ఎన్నికలకు ముందు నగరాన్ని సందర్శించిన వారు ఇప్పుడు నగరాన్ని సందర్శించి నాలుగున్నరేళ్లలో ఇంత మార్పా అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఏపీ శాసన సభ డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆలోచనలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సకరించడంతో నగరం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోని మిగిలిన నగరాలతో పోటీపడుతోంది. నగరంలో నిత్యం రద్దీగా ఉండే అంబేడ్కర్ జంక్షన్, బాలాజీ జంక్షన్, మయూరీ జంక్షన్ మార్గాలను పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా విస్తరించారు. నగర ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులను ఆకట్టుకునేలా రూ.1.30 కోట్లతో అచంటా గార్డెన్‌ను అభివృద్ధి చేశారు. మూడు వాటర్ ఫౌంటైన్‌లు, వాకింగ్ ట్రాక్, జిమ్ ఎక్విప్‌మెంట్‌తో పాటు ఆహ్లాదాన్ని పంచేలా గ్రీనరీని ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. పార్కు పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుద్ధుడి విగ్రహం, ఐ లవ్ విజయనగరం పేరిట ఏర్పాటుచేసిన ఐకాన్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



ఆహ్లాద వాతావరణంలోకి ఆహ్వానం పలుకుతున్న గార్డెన్ ముఖ ద్వారం



గార్డెన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'బుద్ధం శరణం గచ్ఛామి' ఐకాన్



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 'ఐ లవ్ విజయనగరం' ఐకాన్